క్లుప్తంగా

జాతీయ గ్రంథాలయ దినోత్సవం



అన్నపురెడ్డిపల్లి: రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పెద వాగు ప్రాజెక్ట్ గ్రామంలోగల ప్రభుత్వ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల(దమ్మపేట)లో మంగళవారం గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారతీయ గ్రంథాలయాల పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.సింధుశ్రీ, లైబ్రేరియన్ ఎం.అరుణ, బోధన సిబ్బంది ఉమా హైమావతి, స్పందన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల కళాశాలలో జాతీయ గ్రంథాలయ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. దేశంలో గ్రంథాలయాల వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌కె.బురాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జీఎస్టీపై వ్యాపారులకు అవగాహన

భద్రాచలంఅర్బన్: భద్రాద్రి ఛాంబర్ ఆఫ్ కామర్స్, ది రైస్ అండ్ కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో జీఎస్టీ కార్యాలయ సూపరింటెండెంట్ జి.సుశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సంవాద్ సెషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ జి.సుశాంత్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఎన్.మధు వ్యాపారులకు జీఎస్టీపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీతారామ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవిప్రసాద్, చారుగుళ్ల శ్రీనివాస్, అకౌంట్ ప్రాక్టీషనర్లు పసుమర్తి సత్యనారాయణ, రాంబాబు, హవల్దార్ శివాలాల్ పలువురు వ్యాపార ప్రముఖులు పాల్గొన్నారు.

పెంట్లంలో వైద్యశిబిరం

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండలంలోని పెంట్లం గ్రామంలో ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. దగ్గు, జలుబు, జ్వరాలతో బాధపడుతున్న వారికి వైద్యపరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి ప్రియాంక మాట్లాడుతూ.. సీజినల్ వ్యాధుల ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆమె సూచించారు. వైద్యసిబ్బంది ప్రకాష్‌రావు, లావణ్య, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆక్సిజన్ కాన్సంట్రేటర్ వితరణ



కరకగూడెం: ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌ను అందజేస్తున్న సంస్థ బాధ్యులు

కరకగూడెం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆధార్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రూ.25,000 విలువైన ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌ను వితరణ చేశారు. సంస్థ నిర్వాహకులు తోలెం రమేష్ ద్వారా వైద్యులు రవితేజ, హెచ్ఈఓ పోలే బోయిన కృష్ణయ్యకు అందజేశారు. పినపాక నియోజకవర్గంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఇలాంటి సహాయం అందిస్తున్నట్లు తోలెం రమేష్ తెలిపారు. కార్యక్రమంలో ఆధార్ సంస్థ వాలంటీర్ రాము,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

21న శాంతి ర్యాలీ

మణుగూరుటౌన్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని, ప్రపంచ శాంతిని కాపాడాలని కోరుతూ ఈనెల 21న శాంతి ర్యాలీని తలపెట్టినట్లు అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. మంగళవారం సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో స్నేహా గార్డెన్స్‌లో జరిగిన అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల సమావేశంలో నాయకులు పాల్గొని మాట్లాడారు. ప్రపంచ శాంతికి విఘాతం కలిగే విధంగా ఇజ్రాయిల్ వ్యవహరిస్తోందని, ఈ చర్యలు వ్యతిరేకంగా మణుగూరులో చేపట్టనున్న శాంతి ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు మధుసూధన్‌రెడ్డి, కూచిపూడిబాబు, కుంటా లక్ష్మణ్, జక్కుల రాజబాబు, సత్రపల్లి సాంబశివరావు, పూర్ణచందర్‌రావు, చంద్రం, కల్యాణ్‌బాబు, సిరాజ్‌పాషా, రఫి, జీవి, రంజిత్, ఆవుల నర్సింహారావు, చెన్నకేశవులు, నాగేశ్వరరావు, బొల్లం రాజు, సర్వర్, అప్పయ్య, జానయ్య, సాగర్ యాదవ్, లియాకత్, బియాభాని తదితరులు ఉన్నారు.

రహదారి నిర్వహణ ఇలాగేనా?

- తారురోడ్డుకు మట్టితో మరమ్మతులు
- దుమ్ములేచి వాహనదారులకు ఇబ్బందులు
- వర్షం పడితే బురదతో మరింత ఇక్కట్లు



తారురోడ్డుపై గోతులను మట్టితో పూడుస్తున్న ఆర్‌అండ్‌బీ గ్యాంగ్‌మెన్‌లు



బూర్గంపాడు: తారు రోడ్డుకు మట్టితో మరమ్మతులు చేసి ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు తమ ఇంజినీరింగ్ నైపుణ్యాలను చాటుకుంటున్నారు. బూర్గంపాడు–సారపాక మధ్యన ఐదు కిలోమీటర్ల రాష్ట్రీయ రహదారి వర్షాలు, వరదలకు పూర్తిగా దెబ్బతింది. 2022లో వచ్చిన గోదావరి వరదలకు ఈ రహదారి మొత్తం మునిగిపోయింది. వరద ప్రవాహానికి చాలాచోట్ల రహదారి పూర్తిగా దెబ్బతింది. నాటి నుంచి నేటి వరకు ఈ రహదారి దుస్థితి మారడం లేదు. శ్రీరామనవమికి మాత్రం గోతులలో కంకర పోసి దానిపై క్రషర్ డస్ట్ వేసి మమ అనిపిస్తున్నారు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారిపై ఆర్‌అండ్‌బీ అధికారులు చేపడుతున్న నామమాత్రపు మరమ్మతులు మూడునాళ్ల ముచ్చటగానే మిగులుతున్నాయి.

తరుచుగా ప్రమాదాలు

గత నాలుగేళ్లుగా బూర్గంపాడు–సారపాక మధ్య రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. గోతులను తప్పించే క్రమంలో పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురైన ఘటనలున్నాయి. పాతగొమ్మూరు సమీపంలో గోతిని తప్పించే క్రమంలో ఆటోబోల్తాపడి డ్రైవర్ ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. వర్షాకాలం గోతులలో నీరు చేరటంతో లారీలు, బస్సులు, కార్లవంటి పెద్ద వాహనాలు వెళ్లేటప్పుడు బురద నీరు చింది మోటార్ సైకిలిస్టులపై పడుతున్నాయి. బట్టలు బురదతో పాడవటంతో ద్విచక్ర వాహనదారులు తమ ప్రయాణాలను వాయిదా వేసుకుంటున్నారు. రాష్ట్ర మంత్రుల పర్యటన ఉన్నప్పుడు ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు కొంత కంకర తీసుకువచ్చి గోతులలో నింపుతున్నారు. అయితే కంకర వేసి తారు వేయకుండా వదిలేయటంతో పెద్దవాహనాలు వెళ్లే సమయంలో కంకర రాళ్లు ఆయా వాహనాల టైర్ల అంచులకు తగిలి పైకి లేచి పక్కన వెళ్తున్న ద్విచక్ర వాహనదారులపై పడుతున్నాయి. దీంతో పలువురు గాయపడిన ఘటనలు కూడా ఉన్నాయి. ఈ మధ్యన బస్సు వెళ్లే సమయంలో కంకర రాయి టైర్ అంచున పడి బలంగా పైకి లేచి మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న రెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఓ యువకుడి కంటికి తగిలింది. దీంతో ఆ యువకుడిని హైదరాబాద్ తరలించి కంటికి శస్త్ర చికిత్సలు చేయించారు.

మరమ్మతుల్లో లోటుపాట్లు..

గత కొన్ని నెలలుగా ఈ రహదారిలోని గోతులను పూడ్చేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు పక్కన మట్టి తవ్వి తాత్కాలిక చర్యలు చేపట్టారు. స్థానికులు మట్టితో గోతులు నింపడమేమిటని ప్రశ్నిస్తే ప్రమాదాలు జరగకుండా తక్షణ చర్యల కోసమని పొంతన లేని సమాధానాలతో దాటవేశారు. ఇటీవల గోతులు పూడ్చేందుకు గ్రావెల్ తోలించి ఆ మట్టితో గోతులను నింపుతున్నారు. పెద్ద వాహనాలు వెళ్లే క్రమంలో దుమ్మురేచి ద్విచక్రవాహనదారుల కళ్లలో పడుతోంది. ఇలా నింపిన మట్టి మొత్తం వారం రోజులకే లేచిపోతోంది. వర్షం కురిస్తే ఆ రహదారి మొత్తం బురదగా మారుతోంది. గోతులలో కంకర వేసి ఆపై వెట్‌మిక్స్, క్రషర్ డస్ట్ వేసి ఆపైన తారు వేయాల్సి ఉండగా అలాంటి మరమ్మతులు కాకుండా ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు మట్టితోనే కవర్ చేయటం వాహనదారులను, స్థానికులను ఆశ్చర్యపరుస్తోంది. ఈ రోడ్డు దుస్థితిని తెలియజేసేందుకు సారపాక మూలమలుపు వద్ద గోతులలో పొడైన కూలర్లు, టీవీలు పెట్టి హెచ్చరికలు చేశారు. అయినా ఆర్‌అండ్‌బీ అధికారులలో మాత్రం ఎలాంటి స్పందన లేదు. ఇప్పటికైనా ఈ రహదారి దుస్థితిపై అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మట్టితో గోతులు నింపుతున్నారు..

మూడేళ్లుగా బూర్గంపాడు–సారపాక రోడ్డు గోతులను మట్టితో నింపుతున్నారు. దీంతో దుమ్ము లేచి మోటార్‌సైకిళ్లపై వెళ్తున్న వారి కళ్లలో పడుతోంది. వర్షం వస్తే బురద పడుతోంది. తారు వేయాలి.

– జీడిమళ్ల సత్యనారాయణ, రెడ్డిపాలెం

వెట్‌మిక్స్ వేస్తున్నాం..

బూర్గంపాడు–సారపాక రహదారిలో గోతులను పూడ్చేందుకు కంకరపోసి దానిపై వెట్‌మిక్స్ వేస్తున్నాం. దానిపై మట్టిపోస్తున్నాం, రోడ్డు మరమ్మతులకు పటిష్ట చర్యలు తీసుకుంటాం.

– సతీష్, ఆర్‌అండ్‌బీ డీఈ

అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే



పినపాక: రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

పినపాక: మండలంలో విస్తృతంగా పర్యటించిన స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రూ. 52లక్షలతో తోగ్గూడెం, పినపాక, బోటిగూడెం, ఉప్పాక గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమంలో తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎంపీడీఓ సునీల్‌కుమార్, పిఆర్‌డీఈ వశ్యానాయక్, ఏఈ వంశీ, హౌజింగ్ ఏఈ వినీత, విద్యుత్ ఏఈ వేణుగోపాల్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. మరోవైపు, పినపాక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు ఐటీసీ సహకారంతో 41 సైకిళ్లను అందజేశారు. ఐటీసీ హెచ్ఆర్ మెనేజర్ చెంగల్‌రావు, పాఠశాల హెచ్ఎం రమణ, ఎంఈఓ కె.నాగయ్య, పీడీ వీరన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇక, పినపాక ప్రభుత్వ ఆస్పత్రిని ఎమ్మెల్యే పాయం ఆకస్మికంగా తనిఖీ చేసి రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.3లక్షలతో ఎస్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన నూతన కమ్యూనిటీ శానిటరీ కంప్లెక్స్ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పూడిక పనుల పరిశీలన



కాలువ పూడికతీత పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం: మండలంలోని వీరభద్రారం, నడికుడి, సుబ్బారావు పేట గ్రామాల్లో తాలిపేరు కాలువలో తూటికడలు, గుర్రపు డెక్క మొక్కలు, పూడిక తీత పనులను చేపడుతుండగా.. ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మంగళవారం పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులను పూడిక పనులను సత్వరమే పూర్తి చేసి, రైతులకు నీరు అందించాలని ఆదేశించారు. పూడిక పనులకు బడ్జెట్ సరిపడకపోతే, జిల్లా మంత్రితో మాట్లాడి నిధులు తీసుకొస్తానని అన్నారు. తాలిపేరు కాలువ చివరి భూమల వరకు రైతాంగానికి సాగు నీరు అందించాలని, దానికి అవసరమైన చర్యలు అధికారులు తీసుకోవాలని సూచించారు.ఆయన వెంట ఇరిగేషన్ ఈఈ సయ్యద్ అహ్మద్ జానీ, డీఈ మధుసూధన్ రావు, ఏఈలు రాజ్‌సుహాస్, హర్షనాగు, పీటీ మస్తాన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

క్రీడాకారుడికి అభినందన

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారుడు డీవీ శంకర్రావ్‌ను ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ మంగళవారం అభినందించారు. కేరళ రాష్ట్రంలో జరిగిన జాతీయ స్థాయి మాస్టర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నాలుగు బంగారు పతకాలను శంకర్రావ్ సాధించగా.. ఎమ్మెల్యే అభినందించి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 73 ఏళ్ల వయస్సు మాత్రమే కాకుండా బైపాస్ సర్జరీ అయినప్పటికీ లెక్కచేయకుండా సిటీ స్టైల్ జిమ్ కోచ్ జీవి రామిరెడ్డి కఠోర శిక్షణలో ఆరు నెలలోనే జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో నాలుగు బంగారు పతకాలు సాధించారన్నారు. శంకర్రావ్ మరెన్నో పతకాలు సాధించి భద్రాద్రికి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో భోగాల శ్రీనివాసరెడ్డి, శివరామకృష్ణ, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని జగదీష్ కాలనీ, ఎల్‌బీజీ నగర్ కాలనీలో తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సీపీఎం వార్డు కమిటీ ఆధ్వర్యంలో భద్రాచలం గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. స్పందించిన కార్యదర్శి శ్రీనివాసరావు సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చినట్లుగా సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎంబీ నర్సారెడ్డి, పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామిలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ గడిచిన పది నెలలుగా ఈకాలనీలలో మంచినీరు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కమిటీ సభ్యులు అంబోజీ రత్నం, పార్టీ సభ్యులు బుయ్యని సౌభాగ్యం తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు..

దమ్మపేట: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం దమ్మపేటలో నిర్వహించిన సీఐటీయూ కార్మికుల మండల సమావేశంలో బ్రహ్మాచారి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన వ్యక్తం చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నాయకులు పిట్టల అర్జున్, కొప్పుల శ్రీను, రఘు, ఈశ్వరమ్మ, ఆమని పాల్గొన్నారు.

చోరీల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సీసీ కెమెరాల ప్రాధాన్యతపై వివరిస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మణుగూరుటౌన్: చోరీల పట్ల కాలనీల్లో సెక్యూరిటీ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, సీసీ కెమెరాల ఏర్పాటుతో చోరీలను, నేరాలను కట్టడి చేసే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని డీఎస్పీ రవీందర్ రెడ్డి సూచించారు. మంగళవారం బీటీపీఎస్, సింగరేణి, హెవీవాటర్ ప్లాంట్ సెక్యూరిటీ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. హెవీవాటర్ ప్లాంట్ కాలనీలో చోరీకి విఫలయత్నంపై చర్చించారు. తాళాలు వేసిన ఇళ్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, రాత్రి సమయంలో విధులు నిర్వర్తించే సిబ్బంది అప్రమత్తంగా ఉండే విధంగా ఇన్‌చార్జ్‌లు పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశంలో మణుగూరు, అశ్వాపురం సీఐలు పాటి నాగబాబు, అశోక్ రెడ్డి, సింగరేణి సెక్యూరిటీ అధికారి శ్రీనివాస్, బీటీపీఎస్, హెవీవాటర్‌ప్లాంట్ సెక్యూరిటీ అధికారులు పాల్గొన్నారు.

ములకలపల్లి ఎస్సైగా మధుప్రసాద్



ములకలపల్లి: ములకలపల్లి ఎస్సైగా ఎస్.మధుప్రసాద్ నియమితులయ్యారు. అశ్వాపురం ఎస్సైగా పనిచేస్తున్న మధుప్రసాద్ బదిలీపై ఇక్కడకు రానున్నారు. ఇన్నాళ్లు ములకలపల్లి ఎస్సైగా పనిచేసిన కిన్నెర రాజశేఖర్ దుమ్మగూడెం పీఎస్‌కు బదిలీ అయ్యారు. ఈమేరకు సంబంధితశాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

రేపు రక్తదాన శిబిరం

అశ్వారావుపేట: అశ్వారావుపేట ఏరియా ఆస్పత్రిలో ఈనెల 14న రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యులు విజయ్‌కుమార్ తెలిపారు. ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన రక్తనిల్వ కేంద్రానికి అనుసంధానంగా ఈ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఆరోగ్య, సమాజ హితం తప్పా.. రక్తదానం చేయడం ద్వారా ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉత్పన్నం కావని, రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని సూచించారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

అశ్వాపురం: అశ్వాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఓ వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. అమెర్ద కాలనీకి చెందిన బర్ల వెంకటేష్(63) ఆయాసం, చాతినొప్పితో అశ్వాపురం పీహెచ్‌సీకి వచ్చాడు. పీహెచ్‌సీ సిబ్బంది వైద్య చికిత్సలు అందిస్తుండగానే గుండె నొప్పితో వెంకటేష్ మృతి చెందాడు.

తప్పుడు ఆరోపణలు సరికాదు

మణుగూరుటౌన్: ఆదివాసీ బీటీపీఎస్ బాధితులపై తుడుందెబ్బ నాయకుడు ఆలెం కోటి తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఆదివాసీ నిర్వాసితుల కమిటీ సభ్యులు మంగళవారం మాట్లాడుతూ.. చందా లింగయ్య, బీటీపీఎస్ కమిటీ అధ్యక్షురాలు కుంజా వెంకటరమణను విమర్శించే స్థాయి కోటికి లేదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కుంజా వెంకటరమణ, పూనెం విజయలక్ష్మి, పి.నర్సమ్మ, ఆదిలక్ష్మి, మంగమ్మ, రజిని పాల్గొన్నారు.

కనీస వేతనాలు ఇవ్వాలని వినతి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బందికి ప్రతినెలా క్రమం తప్పకుండా జీతాలు ఇవ్వాలని, ప్రభుత్వ జీఓ ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ.. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు స్థానిక లేబర్ ఆఫీస్‌లో రికార్డ్ అసిస్టెంట్ జానీ మియాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ బండారు శరత్ బాబు, సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, ఏరియా ఆస్పత్రి శానిటేషన్ సిబ్బంది, నాయకురాలు రమ, ఎలక్ట్రికల్ యూనియన్ బాధ్యులు అన్నం లక్ష్మీ నారాయణ, మమత, సరిత, రమేష్, రవి, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మ్యూజియం అద్భుతం



మ్యూజియంలో పరిశీలిస్తున్న ఎన్ఆర్ఐ రమ్య, తదితరులు

భద్రాచలం: గిరిజన సంస్కృతి, సంప్రదాయలను ప్రస్తుత తరానికి పరిచయం చేసేలా ఏర్పాటు చేసిన గిరిజన మ్యూజియం అద్భుతంగా ఉందని అమెరికాలో స్థిరపడిన వైద్య, ఆరోగ్యశాఖ పూర్వ ఉద్యోగి, భరతనాట్య కళాకారిణి డాక్టర్ రమ్య తెలిపారు. భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజనుల కళాఖండాలు, చిత్రాలు, వస్తువులను పరిశీలించి మాట్లాడుతూ.. భద్రాచలంలో మ్యూజియం ఏర్పాటుకు పాటుపడిన అధికారుల కృషి అభినందనీయమన్నారు. మ్యూజియం ఇన్‌చార్జ్ వీరస్వామి, నిర్వాహకులు మాధవి, రుక్మిణి, జైపాల్‌రెడ్డి, సుధారాణి, సీతారామలక్ష్మి, కమల, కృష్ణవేణి, రమాదేవి, భారతి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు



రక్తదాన శిబిరంలో పాల్గొన్న దాతలు, నిర్వాహకులు

అశ్వాపురం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఎస్‌కేటీ కల్యాణ మండపంలో మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్, అశ్వాపురం మండల యూత్ సంయుక్త ఆధ్వర్యంలో గర్భిణులు, తలసేమియా, సికెల్‌సెల్ అనీమియాతో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 20 మంది రక్తదాతలు రక్తదానం చేశారు. రక్తదాన శిబిరానికి సహకరించిన సున్నం నరేష్, సారయ్యను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మదర్‌థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కొప్పుల మురళి, భద్రాచలం ఏరియా హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ శ్రీను, పాషా, ట్రస్ట్ నిర్వాహకులు సాయికుమార్, సున్నం నరేష్, సారయ్య, సాయి, పవన్, బీఆర్ఎస్ పార్టీ మండల యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, కాసరబాద సందీప్, యువకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న రేగా కాంతారావు

ములకలపల్లి: ప్రజా సమస్యల పరిష్కారం, ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు విమర్శించారు. మాజీ ఎంపీటీసీ శనగపాటి మెహరమణి సీతారాములు స్వగృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకపక్షం రైతుభరోసా, రుణమాఫీ, సన్నవడ్లకు బోనస్ తదితర పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయిందని విమర్శించారు. ఎరువు బస్తాల కోసం రైతులు క్యూలైన్లలో రోజంతా పడిగాపులు కాయాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరాలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం సఫలీకృతం కాలేకపోతోందని ఎద్దేవా చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సమష్టిగా పనిచేసి అద్భుత ఫలితాలు సాధించాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, పుష్పాల చందర్‌రావు, ఉన్నం బాబూరావు, కోండ్రు సుందర్ రావు, పుష్పాల సాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యా పరిరక్షణకు పోరాటాలు



జెండా ఎగురవేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

గుండాల: ప్రభుత్వ విద్యా పరిరక్షణకు, నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా సమరశీలి పోరాటాలు నిర్వహించింది, నిర్వహించేది ఏఐఎస్ఎఫ్ అని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె.షాహెద్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ వేడుకలను మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ర్యాలీ నిర్వహించి, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శ్వేత అరుణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గల్లి నుంచి ఢిల్లీ వరకు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలే ఊపిరిగా, పోరాటాలే ప్రాణంగా దేశ వ్యాప్తంగా తాము ఉద్యమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి గడ్డం వరుణ్, నాసీర్, కొప్పుల పవన్ కల్యాణ్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి

అశ్వారావుపేట: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటం రాజు డిమాండ్ చేశారు. మంగళవారం అశ్వారావుపేటలో భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి వెల్ఫేర్ బోర్డు ద్వారా సేకరించిన నిధులను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి మాత్రమే వినియోగించాలన్నారు. సమావేశంలో అధ్యక్షులు కణితి సరసారావు, చెన్నారావు, అపన్న తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు అందజేత

అశ్వారావుపేటరూరల్: విద్యుత్ ప్రమాదాల్లో మృతి చెందిన కుటుంబాలకు మంజూరైన నష్ట పరిహారం చెక్కులను అశ్వారావుపేట ట్రాన్స్‌కో ఏడీఈ బి.వెంకటరత్నం అందించారు. ఈ మేరకు స్థానిక కార్యాలయంలో మంగళవారం ఏడీఈ మట్లాడుతూ.. మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన పసుపులేటి చిన్న పోలయ్య(50), దమ్మపేట మండలానికి చెందిన చిట్టెటి సూర్య చంద్రం(45) ఆయిల్ పాం తోటల్లో కరెంట్ షాక్‌కు గురై మృతి చెందారని తెలిపారు. కాగా, తెలంగాణ ఉత్తర విద్యుత్ సంస్థ ద్వారా ఒక్కో బాధిత కుటుంబానికి రూ.5లక్షలు చొప్పున ఇరు కుటుంబాలకు రూ.10లక్షలు మంజూరు చేయడంతో కుటుంబీకులకు చెక్కులను అందించామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈలు జి.రవి, సాయి కిరణ్, సబ్ ఇంజనీర్లు కె.విజయ్, కృష్ణ, ఎం.శివ శంకర్ పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని లెనిన్ నగర్ 17వ వార్డులో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇళ్లు మంజూరైన ముగ్గురు లబ్ధిదారులకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు మంగళవారం పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్నటికీ నెరవేరదనుకున్న నిరుపేదల సొంతింటి కల ఇందిరమ్మ ఇండ్ల పథకంతో సాకారమైందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు శివసైదులు, కొర్లకుంట అప్పారావు, మున్సిపల్ సిబ్బంది, వార్డ్ ఆఫీసర్ నాగయ్య పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి తుమ్మల, నందమూరి రామకృష్ణ

దమ్మపేట: దమ్మపేట మండలం నాచారంలో ఏర్పాటుచేసిన దివంగత సీఎం ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆయన తనయుడు నందమూరి రామకృష్ణతో కలిసి రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉమ్మడి ఏపీలో ఎక్కడ ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు ఆహ్వానించినా హాజరవుతానని తెలిపారు. కాగా, ఈ విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆర్థిక సహకారంతో నాచారం టీడీపీ గ్రామ శాఖ ఆధ్వర్యాన ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో ఏపీలోని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, టీడీపీ, కాంగ్రెస్ నాయకులు వాసిరెడ్డి రామనాథం, కనగాల సాంబశివరావు, కట్రం స్వామిదొర, గడ్డిపాటి సత్యం, వలీపాషా, అలపాటి రామచంద్ర ప్రసాద్, ఎల్లిన రాఘవరావు, మాజీ జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.